

ఏనుగులు తిష్ట



ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని వసప వంశధార నదీ తీరం సమీపంలోని మామిడి తోటల్లో వారం రోజుల నుంచి నాలుగు ఏనుగు గుంపు తిష్ట వేశారు. గురువారం చెరుకు, జొన్న అరటి తదితర పంటను ధ్వంసం చేశారు. దీంతో ఆర్థికంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు ఏనుగులు గుంపు సంచరిస్తుండడంతో స్థానికులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఏ సమయంలో గ్రామంలోకి ప్రవేశిస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఏనుగులు గుంపును తరలించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గంజాయి సమూల నిర్మూలనకు చర్యలు

- అక్రమ వ్యాపారాలతో సంపాదించిన ఆస్తులు జప్తు చేస్తాం
- మూడో దశలో 7,378 కేజీల గంజాయి నిర్వీర్యం
- విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి



మాట్లాడుతున్న డిఐజి గోపీనాథ్ జట్టి

ప్రజాశక్తి - లావేరు

విశాఖపట్నం రేంజ్ పరిధిలో గడిచిన ఎనిమిది నెలల్లో గంజాయి సమూల నిర్మూలనకు కఠిన చర్యలు చేపట్టడంతో పాటు వాటి మూలాలను గుర్తించి బాధ్యులైన వారిని నిందితులుగా చేర్చామని విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి తెలిపారు. యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని కోరారు. మండలంలోని పాతకుంకాం పరిధిలోని రైన్‌బో ఇండస్ట్రీ వద్ద శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పోలీసులు 226 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 7,378 కిలోల గంజాయిని డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యాన గురువారం నిర్వీర్యం చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లా ఎస్‌పిలు కె.వి మహేశ్వర్ రెడ్డి, వకుల్ జిందల్, ఎస్.వి మాధవ్ రెడ్డి గంజాయి నిర్వీర్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ గంజాయి అక్రమ వ్యాపారాల్లో ఆస్తులు కూడబెట్టిన వ్యక్తులను గుర్తించి, వారి ఆస్తులను జప్తు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లోని రెండు కేసుల్లో ఆస్తులు జప్తు చేశామన్నారు. ఈ ఏడాది జనవరిలో రేంజ్ పరిధిలోని అనకాపల్లి జిల్లాలో 34,419 కేజీల గంజాయి, 39.4 లీటర్ల హాషిష్ ఆయిల్, రెండో దశ అల్లూరి జిల్లాలో ఫిబ్రవరిలో 3075 కేజీల గంజాయిని, 25.5 లీటర్ల హాషిష్ ఆయిల్ నిర్వీర్యం చేశామన్నారు. మూడో దశలో శ్రీకాకుళంలో చేసినట్లు చెప్పారు. ఎనిమిది నెలల కాలంలో గంజాయి నిర్మూలన చర్యల్లో భాగంగా 524 కేసుల్లో 31,768 కేజీల గంజాయి, 12.05 లీటర్ల హాషిష్ ఆయిల్, 372 వాహనాలు సీజ్ చేసి 2050 మంది నిందితుల్ని అరెస్టు చేసినట్లు వివరించారు. అందులో 575 మంది అంతర్రాష్ట్ర నిందితులు ఉన్నారని తెలిపారు. ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయి అక్రమ రవాణా సాగుతోందని గుర్తించి 24 అంతర్రాష్ట్ర సరిహద్దుగా, 15 జిల్లాల సరిహద్దుగా ప్రధాన చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయాలకు అనుసంధానం చేశామన్నారు. గంజాయి సాగుని నియంత్రించేందుకు ప్రత్యామ్నాయ పంటలకు గాను రైతులకు 22 రకాల విత్తనాలను అందజేశామన్నారు. డ్రోన్ కెమెరాల నిఘాతో 327 గ్రామాల్లో 90 ఎకరాల గంజాయి సాగుని గుర్తించి నిర్వీర్యం చేశామని చెప్పారు. గంజాయిని పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు సంకల్పం పేరిట అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి ఐదు లక్షల మంది విద్యార్థులు, యువతకు చైతన్యం కల్పించి, ప్రతి పాఠశాల, కళాశాలలో డ్రాప్ బాక్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. 23 గంజాయి కేసుల్లో 40 మందికి న్యాయస్థానాల్లో శిక్షలు ఖరారు కాగా, సుమారు 20 మందికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షలు విధించినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వీలైనంత త్వరగా ట్రైల్ జరిగే చర్యలు తీసుకుంటామన్నారు.

గంజాయి అక్రమ రవాణా, వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల ఎఎస్‌పిలు పి.శ్రీనివాసరావు, పి.సౌమ్యలత, అంకిత సూరన, డిఎస్‌పిలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : వార్షిక తనిఖీల్లో భాగంగా అర్మ్డ్ రిజర్వ్ పోలీసు కార్యాలయం, డిసిఆర్, స్పెషల్ బ్రాంచ్, పాస్‌పోర్టు విభాగాలను డిఐజి గోపీనాథ్ జట్టి సందర్శించి రికార్డుల నిర్వహణను పరిశీలించారు. జిల్లా నేర రికార్డు బ్యూరో, స్పెషల్ బ్రాంచ్, పాస్‌పోర్టు సెల్ అధికారులు, సిబ్బంది పనితీరు, రికార్డులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. పోలీసుల సంక్షేమానికి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఎస్‌పి కె.వి రమణ, ఎఆర్ డిఎస్‌పి ఎల్.శేషాద్రి, డిఎస్‌పి వివేకానంద ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ

యాప్‌లో నమోదు తప్పనిసరి

ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ

ప్రజాశక్తి - ఆమదాలవలస


అంగన్వాడీలు పోషణ్ ట్రాక్ యాప్‌లో ఫేస్ ఎన్‌రోల్‌మెంట్ నమోదు చేయాలని ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ స్పష్టం చేశారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో పిఒ ఎస్.అనురాధ అధ్యక్షతన అంగన్వాడీ కార్యకర్తల శిక్షణా తరగతులను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ్ ట్రాక్ యాప్‌లో లబ్ధిదారుని ఫేస్ కాప్చర్ చేయాలని సూచించారు. లబ్ధిదారులకు ఇచ్చే పౌష్టికాహారాన్ని ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయాలన్నారు. యాప్‌లో వివరాలు సరిగ్గా నమోదు చేయకపోతే లబ్ధిదారులు నష్టపోతారని చెప్పారు. విధుల్లో అలసత్వం వహించకుండా సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను సొంత బిడ్డల్లా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీబాయి, లీలారాణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కళింగపట్నంలో పాసింజరు జెట్టీ నిర్మించండి

సిఎంను కోరిన ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గార మండలంలోని కళింగపట్నం తీరంలో పాసింజరు జెట్టీని నిర్మించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆయన ఛాంబరులో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఈ జెట్టీ నిర్మాణానికి 2016లో కేంద్ర ప్రభుత్వం రూ.పది కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. గత ప్రభుత్వం దీన్ని పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా దీనిపై డిపిఆర్‌ను సిద్ధం చేయించి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని కోరారు. ఈ జెట్టీ నిర్మాణంతో వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. దీనిపై సిఎం స్పందించి ఆయన ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్రకు బాధ్యతలు అప్పగించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



చంద్రబాబుకు వివరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

పిఎం యోగా అవార్డుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్ర ప్రభుత్వ ఆయుష్ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం యువజన సర్వీసుల క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి యోగా అవార్డు-2025 ఎంపిక జరుగుతుందని సెట్‌శ్రీ సిఇఒ బి.వి ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో వ్యక్తులు, సంస్థల నుంచి ఆన్‌లైన్‌లో నామినేషన్లు, ప్రతిపాదనలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అర్హత గల వ్యక్తులు, సంస్థల నుంచి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వ్యక్తిగత విభాగంలో దరఖాస్తుదారులకు 40 ఏళ్ల వయసుతో పాటు 20 ఏళ్ల అనుభవం ఉండాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు పరిశీలించి జాతీయస్థాయిలో వ్యకిగతం, సంస్థలు, అంతర్జాతీయ స్థాయిలో వ్యక్తిగత, సంస్థలకు వేర్వేరుగా నాలుగు రకాల అవార్డులు అందించనున్నట్లు తెలిపారు. అవార్డుల ప్రదానం ఈ ఏడాది జూన్ 21న జాతీయ స్థాయిలో ఉంటుందని వివరించారు. దరఖాస్తు నమోదుకు ఈనెల 31 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. https://innovateindia.mygov.in/pm-yoga-awards చిరునామాలో వెబ్ ఆప్షన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు.

సమాజ శ్రేయస్సు ధ్యేయం కావాలి



మాట్లాడుతున్న కృష్ణ

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

సమాజ సంక్షేమం, వ్యవస్థల శ్రేయస్సే ధ్యేయంగా సామాజికకర్తలు, అధ్యయనకారులు, ఎన్‌జిఒలు పనిచేయాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. వరల్డ్ సోషల్ వర్క్ డే సందర్భంగా స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యాన గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా బెజ్జిపురం యూత్ క్లబ్ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో ఎన్‌జిఒల పాత్ర కీలకమన్నారు. గాంధీజీ ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ సామాజిక సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (విజయనగరం) సోషల్ వర్క్ విభాగం అధ్యాపకులు ఎం.నగేష్ మాట్లాడుతూ తరాల మధ్య సమాజంలో అంతరాలు పెరుగుతున్నాయన్నారు. పాత, కొత్త తరాల మధ్య సంఘీభావం మరింత పెరిగినట్లయితే విలువలు, బాధ్యతాయుతమైన ఆలోచనలు శాశ్వతంగా కొనసాగే అవకాశం ఉంటుందన్నారు. మానవ హక్కుల సంఘం నాయకులు వి.ఎస్ కృష్ణ మాట్లాడుతూ ప్రజలు కోరుకునే ప్రగతికి పాలకులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గిరిజనులు, మహిళలు, వలస జీవులు, మైనార్టీల హక్కుల రక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. బిఆర్‌ఎయు సోషల్ వర్క్ విభాగాధిపతి, ఒఎస్‌డి యు.కావ్య జ్యోత్స్న అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డి.వనజ, కె.శ్యామల, విభాగపు పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంశధార ప్రాజెక్టును ఆధునికీకరించాలి

ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

ప్రజాశక్తి - మెళియాపుట్టి



మాట్లాడుతున్న గోవిందరావు

వంశధార ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలో పూడిక తీసి ఆధునికీకరణ పనులు చేపట్టాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఇరిగేషన్ స్కీమ్‌లపై గురువారం ఆయన మాట్లాడారు. ఆయకట్టులో భాగంగా ఎత్తయిన భూములకు నీరందించడానికి అవసరమైన చోట ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేయాలని కోరారు. వంశధార సిక్కోలు రైతులకు జీవనధార అని అన్నారు. ఎడమ ప్రధాన కాలువ ద్వారా 12 మండలాల్లో సుమారు 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. కుడి ప్రధాన కాలువ ద్వారా ఏడు మండలాలకు నీరందించే సామర్థ్యం ఉన్నా, గత ప్రభుత్వం పూర్తిగా ఇరిగేషన్ పథకాలపైనే కాకుండా రైతులపైనా చిన్నచూపు చూడడంతో కాలువలు మరమ్మతులకు గురై ఆయకట్టు వరకు సాగునీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార ప్రాజెక్టు కాలువల ఆధునీకరణ పనులు చేపట్టి, అవసరమైన చోట ఎత్తిపోతల పథకాల ఏర్పాటుతో పాటు ఎడమ, కుడి ప్రధాన కెనాల్‌లో వంద ఎంఎంసిసి లైనింగ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.



ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ సుధాకరరావు

హాస్టళ్లలో నాణ్యత పర్యవేక్షణకు కమిటీ

ప్రజాశక్తి - గుజరాతీపేట

జిల్లాలోని సంక్షేమశాఖ హాస్టళ్లలో పరిశుభ్రత, పారిశుధ్యం, ఆహార నాణ్యతను పర్యవేక్షించడానికి తొమ్మిది మందితో జిల్లా స్థాయి కమిటీని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని సంక్షేమ శాఖ హాస్టళ్లను పర్యవేక్షిస్తుంది. ఈ కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. కమిటీలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి, వికలాంగుల సంక్షేమం, సహాయ సంచాలకులు, ఆహార తనిఖీ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లు, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సభ్యులుగా వ్యవహరిస్తారు. ఈ కమిటీ హాస్టళ్లను క్రమం తప్పకుండా సందర్శించి, అక్కడ అందుతున్న సౌకర్యాలను పరిశీలిస్తుంది. ఏవైనా లోపాలు ఉంటే, వాటిని వెంటనే సరిదిద్దడానికి చర్యలు తీసుకుంటుంది.



నేడు వికలాంగుల గ్రీవెన్స్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రతి నెల మూడో శుక్రవారం నిర్వహిస్తున్న స్వాభిమాన్ వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని ఈనెల 21వ తేదీన ఉదయం పది గంటలకు వికలాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ స్వాభిమాన్‌ను నిర్వహిస్తున్నట్లు వికలాంగుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు కె.కవిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వినతులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

డ్వామా పీడీ సుధాకరరావు

ప్రజాశక్తి- నందిగాం

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా శ్రద్ధతో పనిచేస్తే సత్ఫలితాలు సాధించవచ్చునని డ్వామా పీడీ సుధాకరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం సామాజిక తనిఖీల ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సమావేశంలో రూ.64,500 రికవరీ, 91 వేలు ఫైన్ విధించినట్లు తెలిపారు. 2023-24కు సంబంధించి 1587 ఉపాధి హామీ పనుల ద్వారా కూలీలకు రూ.22,99,68,284 కూలి చెల్లించామన్నారు. రూ.20,14,56,184 13 ఇరిగేషన్ పనులు చేపట్టారు. రూ.33,98,768 పంచాయతీరాజ్‌శాఖ ద్వారా 28 పనులు, రూ.2,36,32,158తో ఆర్‌డబ్ల్యుఎస్ ద్వారా మూడు పనులు, రూ.3,96,26 సామాజిక అడవులు భాగంలో నాలుగు పనులు, రూ.2,67,940 సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా ఆరు పనులు, రూ.8,17,28 కు సంబంధించి సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఆర్.జె.బొడ్డపాడు, హర్షబాడ పంచాయతీల్లో మొక్కలు లేకుండానే చెల్లింపులు నిర్వహించినట్లు గుర్తించామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌పి తిరుపతిరావు, డివిఒ స్వరూపరాణి, ఎపిడిలు పి.రాధ, శైలజ, ఎంపిడిఒ టి.రాజారావు, ఎపిఒ నాగరాజుపాల్గొన్నారు.

31లోగా ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి - అరసవల్లి



రేషన్‌కార్డుల్లో ఉన్న సభ్యులు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈనెల 31వ తేదీలోగా ఇకెవైసి చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 6,60,730 రేషన్ కార్డుల్లో 19,39,082 మంది కుటుంబసభ్యులకు గానూ 17,39,959 మంది ఇకెవైసి పూర్తి చేసుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు పొందడానికి మిగిలిన 1,99,123 మంది కుటుంబసభ్యులు 31వ తేదీ లోగా పూర్తి చేయాలని తెలిపారు.

ఇకెవైసి నమోదు కాని వారి వివరాలు రేషన్ డీలర్, విఆర్‌ఒ, తహశీల్దార్, పిడిఎస్ వెబ్‌సైట్‌లో తెలుసుకొని నమోదు చేసుకోవచ్చని తెలిపారు. వేరే ప్రాంతంలో ఉన్న వారు కూడా వారి రేషన్ కార్డు నంబరు ఉపయోగించి డీలర్, విఆర్‌ఒ, తహశీల్దార్ కార్యాలయంలో గానీ ఇకెవైసి నమోదు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

సభాహక్కుల కమిటీలో ఎంజిఆర్‌కి చోటు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సభా హక్కుల కమిటీలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు చోటు దక్కింది. ప్రభుత్వం ఐదు రకాల కమిటీలను ఏర్పాటు చేస్తూ గురువారం బులిటెన్ విడుదల చేసింది. అందులో ఎమ్మెల్యే పితాని సత్యనారయణ చైర్మన్‌గా ఆరుగురు సభ్యులతో ప్రివిలైజ్ కమిటీని నియమించింది. ఇందులో ఎమ్మెల్యే గోవిందరావును ఒక సభ్యునిగా నియమించింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పాతపట్నం నుంచి ఈయన తొలిసారి గెలుపొందారు. శాసనసభ, సభ్యుల హక్కులకు భంగం వాటిల్లితే కమిటీ విచారించి చర్యల కోసం స్పీకర్‌కు సిఫార్సు చేస్తుంది. సభా హక్కుల కమిటీలో చోటు కల్పించడంపై ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అనుచరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కొండచీపుర్లు చేతబట్టి ధర్నా చేస్తున్న గిరిజనులు

కొండచీపుర్లతో గిరిజనుల నిరసన

కొత్తూరు: గిరిజనుల అటవీ ఉత్పత్తులైన కొండ చీపుర్లకు జిసిసి మద్దతు ప్రకటించాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న డిమాండ్ చేశారు. మండలంలోని గొట్టిపల్లి సచివాలయం ఎదుట కొండ చీపుర్లు చేపట్టి పెద్ద ఎత్తున గిరిజనులు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అటవీశాఖ అధికారులు, జిసిసి గిరిజన అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయడం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. జిల్లాలో12 మండలాల్లో లక్షా 5 వేల గిరజన కుటుంబాలు ఉన్నాయని, గిరిజనులంతా పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. గిరిజనులు పండించిన పంటలు గిరిజన కార్పొషన్ ద్వారా కోనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల అభివృద్ధి పనిచేస్తున్న ఐటిడిఎ పిఒ జోక్యం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సవర మోహనరావు, జమ్మయ్య, సవర సూర్యారావు, సవర బాగున్న సవర నాగేష్, నిమ్మక రత్నాలమ్మ పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న ఎఫ్ఎస్ఒ శ్రీరాములు

హోటళ్లలో నాణ్యత తప్పనిసరి

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

కవిటి: ప్రజలు ఎంతో నమ్మకంతో హోటళ్లకు వస్తారని, అటువంటి వారి ప్రాణాలతో చెలగాటమాడొద్దని జిల్లా ఆహార తనిఖీ విభాగం ఎఫ్ఎస్ఒ శ్రీరాములు అన్నారు. 'పాడైన ఆహారం... పొంతన లేని సమాధానం' అంటూ ఈ నెల 16న 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనానికి జిల్లా ఆహార తనిఖీ అధికారులు స్పందించారు. జిల్లా ఆహార ఉప తనిఖీ అధికారి వెంకటరావు ఆదేశాల మేరకు ఎఫ్ఎస్ఒ శ్రీరాములు మహాలక్ష్మి హోటల్‌ను గురువారం తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నమూనాలు సేకరించి సీల్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హోటల్‌లో ఆహార పదార్థాల తనిఖీ పరిశీలించామని, రంగులు ఎక్కువగా ఉన్న బిర్యానీ నమూనాలు తనిఖీ నిమిత్తం సేకరించినట్లు చెప్పారు. జిల్లా కేంద్రానికి దూరంగా ఉండటంతో చాలా హోటళ్లు నిబంధనలు పాటించడం లేదని, అటువంటి వాటిపై తమకు ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. ఆహార విక్రయ కేంద్రాలపై ఎటువంటి ఫిర్యాదు వచ్చినా ఉపేక్షించేది లేదని, సదరు విక్రయ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

'ఐతమ్' విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బిటెక్ మెకానికల్ రెండో ఏడాదికి చెందిన 137 మంది విద్యార్థులకు ఈనెల 11 నుంచి 24 వరకు ఎపిఎస్ఎస్‌ఒసి సిఎంఎస్ ఎక్సెన్స్ కేంద్రం ద్వారా 'ప్రొడక్ట్ డిజైన్ అండ్ డ్రాఫ్టింగ్' అనే అంశంపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడారు. స్కెచ్చింగ్ అండ్ పార్ట్ డిజైన్, అసెంబ్లీ డిజైన్, సర్ ఫేస్‌జి మోడలింగ్ వంటి అంశాలపై శిక్షణ పొందడంవల్ల ఆయా రంగాల్లో విద్యార్థులకు తగిన నైపుణ్యం అలవడుతుందన్నారు. ఈ తరగతులకు ఎపిఎస్ఎస్‌ఒసి నుంచి కె.ప్రసన్నలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, మెకానికల్ హెచ్ఒడి డాక్టర్ పి.శ్రీహరి, ఎపిఎస్ఎసిసి స్పాక్ డాక్టర్ బి. రామారావు, మెకానికల్ విభాగ కో-ఆర్డినేటర్ ఎండ సాగర్లు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.



ఎంపికైన అభ్యర్థులు

'సూర్యతేజ'లో జాబ్‌మేళా

ప్రజాశక్తి- పలాస

స్థానిక సూర్యతేజ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన ఉద్యోగ మేళాలో పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ దానేటి పద్మాజ కామేశ్వరరావు తెలిపారు. కళాశాల ఆవరణంలో గురువారం జాబ్‌మేళా ఇనర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిగ్రీ, పిజి పూర్తయిన అభ్యర్థులు, ప్రస్తుతం ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. ఈ ఉద్యోగమేళాలో 324 మంది అభ్యర్థులు హాజరు కాగా, వారిలో 98 మంది సూర్యతేజ కళాశాల విద్యార్థులు, 24 మంది ఇతర కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ ఉద్యోగ మేళాలో ఫోక్సకాన్, బ్లూస్టార్, ఎన్ఎస్ ఇన్స్ట్రుమెంటస్, డైకిన్, ఏసియన్, కోల్గేట్, ట్లాంట్ వార్క్స్, పానాసోనిక్ కంపెనీలు పాల్గొన్నట్లు తెలిపారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎఐవైఎఫ్ నాయకులు

ఆస్పత్రుల్లో ధరల పట్టికలు ఏర్పాటు చేయాలి

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో ప్రైవేట్ వైద్యం అత్యంత ఖరీదైందని, సామాన్య ప్రజలపై అధిక భారాలు మోపుతూ రోగుల ప్రాణాలతో ఆస్పత్రి యాజమాన్యాలు చెలగాట మాడుతున్నాయని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సంతోష్, కొన్న శ్రీనివాసరావులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ బాలమురళీకృష్ణను ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆస్పత్రుల్లో రోగులకు అర్థమయ్యే రీతిలో ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే స్కానింగ్, ల్యాబ్, మెడికల్ దుకాణాల పేరుతో పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో సంఘ నాయకులు అరవింద్, టి.మధు, జి.వసంత్, జె.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యుత్ మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు చాపర వెంకటరమణ అన్నారు. గురువారం నగరంలోని ఇపిడిసిఎల్ సర్కిల్ కార్యాలయం ఎదుట విద్యుత్ మీటర్ రీడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. విద్యుత్ శాఖలో గడచిన కొన్నేళ్లుగా మీటర్ రీడర్స్‌గా విధులు నిర్వహిస్తున్న కార్మికులను ప్రభుత్వాలు రోడ్డున పడేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్ల వినియోగం వల్ల లబ్ధిదారులపై భారాలు మోపి ఆదాని కంపెనీలకు దోచి పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి రాకతో విద్యుత్ మీటర్ రీడర్లకు ఉపాధి కోల్పోయే పరిస్థితి నెలకొందన్నారు. ప్రత్యామ్నాయ విధులు అప్పగించి ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హత ప్రకారంగా విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఎస్ క్రో అకౌంట్ ద్వారా వారి జీతాలను చెల్లించాలన్నారు. ధర్నా అనంతరం ఎస్ఇ కృష్ణమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కుమారస్వామి, శ్రీనివాస్, బాలకృష్ణ, వేణు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న విద్యుత్ మీటర్ రీడర్స్

కెజిబివిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి- రణస్థలం

కెజిబివి పాఠశాలలో 2025 - 26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతి నుంచి ఇంటర్ తరగతుల ప్రవేశాలకు బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రణస్థలం మండలం లెంక పేట ప్రిన్సిపాల్ ఎస్.హైమవతి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు https://apkgbv.apcfss.in దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈనెల 22 నుంచి ఏప్రిల్ 11 లోపు దరఖాస్తులు వెబ్‌సైట్‌లో సమర్పించాలన్నారు.



హైమావతి



సౌమ్య

పొందూరు: మండలంలోని లోలుగు కెజిబివిలో 2025-26 ఏడాదికి 6 నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం బైపిసిలో ప్రవేశానికి ఈనెల 22 నుంచి ఏప్రిల్ 11 వరకు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య తెలిపారు. అలాగే 7, 8, 9, 10, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేయడానికి కూడా ఆన్‌లైన్‌లో దర ఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. డ్రాపౌట్స్, అనాథలు, ఎస్‌టి, ఎస్‌సి, బిసి, మైనార్టీలకు చెందిన బాలికలు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందని, ఎంపికైన బాలికలకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందన్నారు.

ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై సమావేశం

రణస్థలం: మండల కేంద్రంలో గురువారం మండలస్థాయి వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ శాఖలతో ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక 2025 - 26 రైతు సాధికార సంస్థ, ప్రకృతి వ్యవసాయం, వెలుగుపై మండలస్థాయి సమన్వయ సమావేశాన్ని మండల వ్యవసాయ విస్తరణ అధికారి సునీత, వెలుగు ఎపిఎం మాధవిలత, ప్రకృతి వ్యవసాయ జిల్లా ట్రైనర్ గోవింద్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళా మండల సమైక్య హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిబ్బంది అందరూ కలిసి 2025 - 26 ప్రణాళిక ఏ విధంగా చేయాలి, రైతులకు ఇందులో ఏ విధంగా భాగస్వామ్యం చేయాలన్న దానిపై సలహాలు, సూచనలు ఇస్తూ రాబోయే కాలంలో ప్రకృతి వ్యవసాయం ఒక ఉద్యమంగా గ్రామస్థాయిలో వెళ్లాలని పిలుపునిచ్చారు. అలాగే వ్యవసాయ విస్తరణ రైతు సేవా కేంద్రం ద్వారా ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాన్ని ముందుకు తీసువెళ్లేలా కృషి చేస్తామన్నారు. నేచురల్ ఫార్మింగ్ మాస్టర్ ట్రైనర్ కార్యక్రమంలో ఆవశ్యకత, సప్త సూత్రాలపై తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గంట్యాడ రాంబాబు, సత్యనారాయణ, శివశంకర్, రాజేశ్వరి, విఒఎలు తదితరులు పాల్గొన్నారు.



ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

మహిళలకు ఎంసెట్ ప్రోగ్రాం

ప్రజాశక్తి- నరసన్నపేట

స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో మహిళలకు ప్రత్యేకంగా ఎంసెట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న నిష్ణాతులైన అధ్యాపకులతో తరగతులు నిర్వహిస్తున్నామని అన్నారు. ఇటీవల ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థినులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9393929359 సెల్ నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

పాఠశాలల బలోపేతానికి కృషి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పాఠశాలల బలోపేతానికి కాంప్లెక్స్ చైర్మన్లు కృషి చేయాలని ఎంఇఒలు కురమాన అప్పారావు, విశ్వనాథం అన్నారు. స్థానిక మండల విద్యా కేంద్రంలో ఏడు సముదాయ కేంద్రాల చైర్మన్లతో, సెక్రటరీలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విధులపై పలు సూచనలు చేశారు. మండలంలో ఏడు కాంప్లెక్స్‌లకు ఒక్కోదానికి రూ.లక్ష నిధులు నిర్వహణ కోసం కాంప్లెక్స్ ఖాతాలో జమ అవుతున్నాయని అన్నారు. ఈ నిధులను సముదాయ సమావేశ నిర్వహణకు, పాఠశాలకు రావాల్సిన టిఎల్ఎం కొనుగోలుకు వినియోగించాలన్నారు.

టైలరింగ్‌పై ఉచిత శిక్షణ

ప్రజాశక్తి- మందస

మండలంలోని వెనుకబడిన తరగతుల మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణను ఇవ్వనున్నట్లు ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ (బిసి కార్పొరేషన్) ద్వారా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 22లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన పథకం కింద 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు ఉన్న వెనుకబడిన తరగతుల్లోని పేద మహిళలు శిక్షణ ఇస్తున్నామని అన్నారు. పూర్తి వివరాలకు సంబంధిత గ్రామ, వార్డు సచివాలయం, మండల పరిషత్ అభివృద్ధి అధికారిని సంప్రదించాలన్నారు. శిక్షణ పొందిన అనంతరం ధ్రువపత్రాలను అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



అవగాహన కల్పిస్తున్న బాలకృష్ణ

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ

ప్రజాశక్తి- నరసన్నపేట

శక్తి యాప్ మహిళలకు రక్షణ అని ఎస్ఐ వి.బాలకృష్ణ అన్నారు. స్థానిక ఎల్‌విఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శక్తి యాప్‌పై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళకు ఆపద కాలంలో అత్యవసర సహాయం అందించేందుకు శక్తి యాప్ కీలకంగా పనిచేస్తుందని తెలిపారు. శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకుని మూడుసార్లు మొబైల్ షేక్ చేసినట్లయితే ఫిర్యాదు రిజిస్టర్ అవుతుందని అన్నారు. ఆ వెంటనే పోలీసులు ఆరు నుంచి తొమ్మిది నిమిషాల్లో వచ్చి వారి సమస్యని పరిష్కరిస్తారని చెప్పారు. ఈ శక్తి యాప్ ప్రతి ఒక్క మహిళా తన మొబైల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు, మహిళలు అత్యవసర పరిస్థితిలో పోలీస్‌స్టేషన్ వెళ్లాల్సిన అవసరం లేకుంటేనే ఫిర్యాదు చేయవచ్చునని వివరించారు. ఈ శక్తి యాప్‌లో 13 రకాల ఫీచర్స్ ఉన్నాయని, సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రసాదరావు, డి.కోటేశ్వరరావు, వై.రాంబాబు, మోహనరావు, కానిస్టేబుల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నోటి పరిశుభ్రతతో ఆరోగ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నోటి పరిశుభ్రత వల్ల మంచి ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమవుతుందని మెప్మా పీడీ ఎస్.వి.రమణ తెలిపారు. గురువారం నగరంలోని విద్యాధరి కళాశాలలో కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువక కేంద్రం, ఉషాడెంటల్ ఆస్పత్రి సంయుక్తంగా ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ క్రమం తప్పకుండా దంత దావనంతో పాటు ఆహారపు అలవాట్లలో మార్పు చేసుకోవడం వల్ల మంచి ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. నోటి పరిశుభ్రతపై ప్రజల్లో అవగహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. నోటి ద్వారా ఆహారాన్ని తీసుకుంటామని, నోటి శుభ్రత లేకపోతే అవి కుళ్లి వివిధ రోగాలు వృద్ధి చెందుతాయన్నారు. ఉషా డెంటల్ క్లినిక్ దంత వైద్య నిపుణులు డాక్టర్ స్నేహజ్యోతి మాట్లాడుతూ నోటి వ్యాధులను నివారించడానికి బ్రెష్ చేయడం, ఫ్లాసింగ్, మౌత్ వాష్ ఉపయోగించడం వంటి రోజువారీ అలవాట్లను ప్రోత్సహించాలన్నారు. నోటి వ్యాధులకు ధూమపానం ప్రధాన కారణమని, ఇది అత్యంత ప్రమాదకరమన్నారు. పొగాకులోని రసాయనాల వల్ల నిరంతర దుర్వాసన వస్తుందని, నోటి కేన్సర్ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. లాలాజలం తగ్గడం వల్ల ఆహారాన్ని నమలడం, మింగడం కష్టమవుతుందని, అధికంగా మద్యం సేవించడం వల్ల నోటి కేన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.జామి భీమశంకరరావు మాట్లాడుతూ నోటి ఆరోగ్యం అంటే నోరు, దంతాలు ముఖ అవయవాల నిర్మాణాలని, అవి వ్యక్తులు మాట్లాడటం, శ్వాస తీసుకోవడం, తినడం వంటి ముఖ్యమైన విధులను నిర్వర్తించడానికి వీలు కల్పిస్తాయన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, లెక్చరర్ ఇన్ ఇంగ్లీష్ వి.టి. నాయుడు, లైఫ్ ఫ్యూయల్ సర్వీస్ ఆర్గనైజేషన్ జాయింట్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ, నెహ్రూ యువ కేంద్ర ఎన్.వై.విలు అరుగుల దిలీప్ కుమార్, గార మౌనిక, మట్ట ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెప్మా పీడీ వెంకటరమణ

స్నేహితునికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆప్త మిత్రుడు ఎన్.సంగమేష్‌కు తోటి స్నేహితులు ఆర్థికసాయాన్ని అందించారు. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని గాజుల కొల్లివలస గ్రామానికి చెందిన ఎన్.సంగమేష్ భార్య వసంత కుమారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. సంగమేష్ భార్య మృతి చెంది వారి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉందన్న విషయాన్ని తెలుసుకున్న ఇంటర్మీడియట్ (2001 - 03) బ్యాచ్‌కు చెందిన తోటి స్నేహితులు సంగమేష్ ఇంటికి చేరుకొని తమవంతు సాయంగా రూ.40 వేలు ఆర్థికసాయాన్ని అందజేసి స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు పాల్గొన్నారు.



సంగమేష్‌కు ఆర్థికసాయాన్ని అందజేస్తున్న స్నేహితులు

25కి ఆశీలు వేలంపాట వాయిదా

ఇచ్ఛాపురం : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఆశీలు వేలం పాటలు వాయిదా పడింది. ఈ ఆర్థిక సంవత్సరానికి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎన్.రమేష్ అధ్యక్షతన బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ప్రభుత్వ వేలం పాట ఎక్కువ కావడం, అదనంగా 18 శాతం జిఎస్‌టి వేయడం, వాచ్‌మెన్ జీతం ఏడాదికి రూ.1.50 లక్షల నుంచి రూ.2.88 లక్షలు పెంచడంపై పాటదారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వేలం పాట రేట్లు అధికం చేయడం, కొత్తగా జిఎస్‌టి చెల్లించాలని నిబంధనలతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు. దీనివల్ల ఆశీలు పెంచితే వ్యాపారులు చెల్లించడానికి ముందుకు రావడం లేదన్నారు. వేలం పాట ధర తగ్గించేంతవరకు పాటలో పాల్గోబోమని చెప్పటంతో కమిషనర్ పాట వాయిదా వేశారు. మళ్లీ ఈ నెల 25న 11 గంటలకు నిర్వహిస్తామని తెలిపారు.



వేలంపాట నిర్వహిస్తున్న కమిషనర్ రమేష్



నివాళ్లర్పిస్తున్న మంత్రులు

కళావతమ్మకు నివాళి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాతృమూర్తి కింజరాపు కళావతమ్మ ప్రథమ వర్ధంతిని గురువారం నిర్వహించారు. మండలంలోని నిమ్మాడ కళావతమ్మ ఘాట్ వద్ద కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, సోదరులు కింజరాపు హరివర ప్రసాద్, కింజరాపు ప్రభాకరరావు, ఎర్రన్నాయుడు సతీమణి విజయమ్మలు నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లి కళావతమ్మను స్మరించుకుని భావోద్వేగం అయ్యారు. కార్యక్రమంలో కింజరాపు కుటుంబ సభ్యులు, కూటమి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

మరింత మందికి ఆదర్శం కావాలి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

గేట్-2025లో ర్యాంకులు కైవసం చేసుకున్న విద్యార్థుల స్ఫూర్తి మరింత మందికి ఆదర్శం కావాలని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం డైరక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ అన్నారు. రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతికవిశ్వ విద్యాలయంలో శ్రీకాకుళం క్యాంపస్ గేట్-2025లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు కొమరాల శ్వేతశ్రీ 241, అప్పన్న శ్రీనివాస్ 663 ర్యాంక్‌లను కైవసం చేసుకున్నారు. సుమారు 60 మంది విద్యార్థులకు మంచి ర్యాంక్‌లు రావడం శుభపరిణామమన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సహించిన అధ్యాపకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి ముని రామకృష్ణ, డీన్ కొర్ల మోహన్ కృష్ణ చౌదరి, ఎఫ్ఒ వాసు, వెల్ఫేర్ స్టూడెంట్ డీన్ గేదెల రవి, సిఎస్ఇ విభాగపతి రమేష్ కుమార్, వివిధ డిపార్ట్‌మెంట్స్ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

వాంబే కాలనీ విద్యార్థికి గేట్‌లో 204వ ర్యాంకు

శ్రీకాకుళం అర్బన్: తండ్రి వెంకట్ చిన్నతనంలో మృతి చెందాడు. తల్లి అనూరాధ నగరంలోని వాంబే కాలనీలో నివాసముంటూ పిల్లలకు అన్నీ తానై టైలరింగ్ వృత్తి చేసుకుంటూ మంచి చదువులు అందించాలని సంకల్పించింది. ఆమె సంకల్పానికి తగ్గట్టుగానే పిల్లలిద్దరు ఎంతో శ్రమ పడి చదువుకున్నారు. నివాస్ మద్రాస్ ఐఐటిలో సీటు దక్కించుకుని సివిల్ ఇంజినీరింగ్ చదువుతున్నాడు. కుమార్తె ఝాన్సీ పది పరీక్షల్లో ప్రతిభ కనబరచి శ్రీకాకుళం ట్రిబుల్ ఐటిలో సీటు దక్కించుకుంది. వారికి చిన్నాన్న రవిశంకర్, పిన్ని రమణి ప్రోత్సహించారు. బుధవారం జాతీయస్థాయిలో ప్రకటించిన గేట్ ర్యాంకుల్లో జాతీయ స్థాయిలో 204వ స్థానాన్ని దక్కించుకున్నాడు. పేద కుటుంబంలో పుట్టిన నివాస్ చదువుపై నిరంతరం ఆసక్తి చూపడం వల్లే ఇది సాధ్యమైంది.



ఎచ్చెర్ల : కేకు కట్ చేస్తున్న డైరెక్టర్ బాలాజీ

సమావేశాన్ని విజయవంతం చేయాలి

నందిగాం : ఈ నెల 21న విశాఖపట్నంలో నిర్వహిస్తున్న ప్రాంతీయ గ్రంథాలయ ఉద్యోగుల పెన్షనర్ల సమావేశాన్ని విజయవంతం చేయాలని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు టి.వైకుంఠరావు ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖలోని ఎల్లమ్మతోట సిఐటియు కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రాంతీయ గ్రంథాలయ ఉద్యోగుల పెన్షనర్లు సమావేశానికి తరలిరావాలన్నారు.

రేపు రక్తదాన శిబిరం

సోంపేట : రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణదాతలుగా మారండి అంటూ బారువ మెరైన్ సిఐ రమేష్ కుమార్ పిలుపునిచ్చారు. బారువ మెరైన్ పోలీసుల ఆధ్వర్యాన ఈ నెల 22న ఉదయం 10 గంటలకు స్థానిక మెరైన్ పోలీస్ స్టేషన్ వద్ద ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా శ్రీనివాస్



శ్రీనివాస్

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి జూనియర్ సివిల్ కోర్టు న్యాయ వాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా లఖినేని శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో బార్ అసోషియేషన్ కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో జనరల్ సెక్రటరిగా ఉప్పాడ తిరుమలరావు, ఉపాధ్యక్షునిగా సంపతి రావు తిరుపతిరావు, సహాయ కార్యదర్శిగా కె.వెంకట రావు, ట్రెజరర్ బమ్మిడి ధర్మారావులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది ఎండ వెంకటరావు వ్యవహరించారు.



శిక్షణలో పాల్గొన్న కార్యకర్తలు

అంగన్వాడీలకు శిక్షణ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పిల్లలకు పరిపూర్ణమైన పోషణ అందించడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం అభివృద్ధి చెందుతుందని ఎంఇఒ వెంకటరమణ అన్నారు. వజ్రపు కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు గురువారం శిక్షణ ఇచ్చారు. 0-6 ఏళ్ల పిల్లల వయసు చాలా కీలకమైమందన్నారు. పరిపూర్ణమైన పోషణతో పాటు పఠనం కూడా అవసరమన్నారు. పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించే దిశగా కృషి చేయాలన్నారు. సిడిపిఒ పార్వతి, ప్రధానోపాధ్యాయులు తారకేశ్వర్‌పండా, ఐసిడిఎస్ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని మాణిక్యపురం సమీపంలోని తోటల్లో పేకాడుతున్న జూదరులపై గురువారం పోలీసులు దాడిచేసి అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ రవివర్మ అందించిన సమాచారం మేరకు గ్రామ సమీపంలో పేకాడుతున్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి నలుగురు జూదరులను అరెస్టు చేసినట్టు తెలిపారు. వీరి వద్ద రూ.8,600లు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్టు తెలిపారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



విచారణ చేస్తున్న పోలీసులు

తాళభద్రలో కార్యదర్శిపై దాడి

ప్రజాశక్తి పలాస

కాశీబుగ్గ తాళభద్ర సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ పి.సోమనాథ్‌పై గురువారం దాడి జరిగింది. విధి నిర్వహణలో భాగంగా సెక్రటరీ తాళభద్రలో ఇంటి పన్ను వసూళ్ల కోసం ఇంటింటికీ వెళ్లాడు. సమయంలో కోళ్ల జగదీష్ సచివాలయ సిబ్బంది దుర్భాషలాడారు. ఇక్కడి నుంచి వెళ్తారా? లేదా? అంటూ కార్యదర్శి మెడ పట్టుకుని తోసేశారు. దీంతో కార్యదర్శి మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కమిషనర్ ఫిర్యాదు మేరకు కాశీబుగ్గ పోలీసులు గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టి వివరాలు సేకరించారు.

నిమ్మాడలో పట్టపగలు చోరీ

కోటబొమ్మాళి: మండలంలోని నిమ్మాడలోని శిమ్మ కృష్ణారావు ఇంట్లో గురువారం పట్టపగలు దొంగలు చోరీకి పాల్పడ్డారు. అక్కడకు కూతవేటు దూరంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తల్లి ప్రథమ వర్ధంతి నిర్వహిస్తున్నారు. జనసంద్రం, పోలీస్ పహారా మధ్యలో పట్టపగలే చోరీ జరగడంతో సర్వాత్రా ఉత్కంఠకు గురిచేసింది. 11 గంటల సమయంలో శిమ్మ కృష్ణారావు కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. ఈ సమయంలో అదును చేసి దొంగలు చోరీకి పాల్పడడం చర్చనీయాంశమైంది. చోరీలో ఆరున్నర తులాల బంగారం అపహరణకు గురైనట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. తాము బయటనుంచి వచ్చి సరికి తామే వేసిన తాళం తీసి ఉందని, ఇంటి లోపలకి వెళ్లి చూడగా బీరువ తాళం తెరిచి చూశామని అన్నారు. అందులోని ఆరున్నర తులాలు బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు లబోదిబోమన్నారు. అక్కడే ఉన్న పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యం

మద్యం స్వాధీనం

ప్రజాశక్తి- కవిటి

విక్రయానికి తీసుకెళ్తున్న 22 మద్యం సీసాలు గురువారం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రవివర్మ తెలిపారు. మండలంలోని కె.కపాసుకుద్దికి చెందిన యర్ర కూర్మారావు గ్రామంలో విక్రయించేందుకు తీసుకువెళ్తుండగా 22 మద్యం సీసాలు మార్గంమధ్యలో స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



శంకుస్థాపన చేస్తున్న సింహాద్రినాయుడు

బోరుకు శంకుస్థాపన

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని గురండిలో వేసవి కాలంలో తాగునీటికి గ్రామస్తులు ఇబ్బందులు లేకుండా రూ.1.50 లక్షలు పంచాయతీ నిధులతో తాగునీరు బోరుకు సర్పంచ్ బోర సింహాద్రినాయుడు గురువారం శంకుస్థాపన చేశారు. దీనితో గ్రామస్తులు తాగునీరు ఇబ్బందులు తొలిగిపోతాయని సంతోషం వ్యక్తం చేశారు.



ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

విలువలతో కూడిన విద్య అవసరం

ప్రజాశక్తి- కవిటి

విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అవసరమని కరస్పాండెంట్ బల్లెడ కృష్ణారావు, వక్త కిషోర్‌కుమార్ పాత్రో అన్నారు. ఎస్‌బిఎల్‌వి ఆర్ష విజ్ఞాన భారతి పాఠశాల వార్షికోత్సవం గురువారం సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక విద్య బలమైన పునాదని, భావి భారత పౌరులను తయారుచేసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో బివికె పాఠశాల విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించే ప్రయత్నం చేయడం హర్షణీయమని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.అనిల్, బర్ల నారాయణరావు, డిక్కల రాజశేఖర్, ఆరింగి త్రివిక్రమరావు, బల్లెడ యజ్ఞానంద్, భావన నారాయణమూర్తి, పొందల జానకిరామయ్య, ఆరింగి వెంకటరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్టార్ వాకర్స్

సునీతా విలియమ్స్‌కు వాకర్స్ అభినందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అంతరిక్షంలో తొమ్మిది నెలల పాటు గడిపి లోక కళ్యాణం కోసం అనేక పరిశోధనలు చేసి సురక్షితంగా భూమిమీదకు చేరుకున్న వ్యామోగామి సునీతా విలియమ్స్ బృందానికి గురువారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్‌వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా అభినందించారు. అంతరిక్షంలో అత్యధిక కాలం గడిపిన వ్యామోగామిగా సునీతా విలియమ్స్ రికార్డ్ సృష్టించారు. నాసా పరిశోధనా కేంద్రం నుంచి సురక్షితంగా భారత్‌కు తిరిగి రావాలని క్లబ్ ప్రతినిధులు ఇందిరా ప్రసాద్, పిజి గుప్తా, శాసపు జోగినాయుడు, గుడ్ల జగ్గారావులు కోరారు. సాంకేతిక సమస్యలు తలెత్తినా ఎంతో ధైర్యంతో ఎన్నో సవాళ్లను ఎదుర్కొని సురక్షితంగా భూమి మీదకు చేరుకోవడం శుభ పరిణామమన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ అగ్రగామి దేశంగా గుర్తింపు తెచ్చుకునేందుకు సునీత విలియమ్స్ స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు జి.లక్ష్మి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

బిసి రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - మందస

బిసి కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం అందజేయనున్న సబ్సిడీ రుణాల మంజూరుకు ఈ నెల 22 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ ఎస్.రమేష్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. బిసిల్లో వివిధ కేటగిరీలకు సంబంధించి మొత్తం78 యూనిట్లు మంజూరైనట్లు వెల్లడించారు. ఇందులో శ్లాబ్-1 కింద యూనిట్ విలువ రూ.2 లక్షల వరకు, బిసి-ఎకు 29 యూనిట్లు, బిసి-బికి ఏడు యూనిట్లు, బిసి-డికి 19 యూనిట్లు మంజూరు అయ్యాయన్నారు, అలాగే శ్లాబ్-2 కింద యూనిట్ విలువ రూ.2 నుంచి రూ.3 లక్షల వరకు, బిసి-ఎకు 9 యూనిట్లు, బిసి-బికి రెండు యూనిట్లు, బిసి-డికి ఆరు యూనిట్లు మంజూరయ్యాయని అన్నారు. యూనిట్ విలువ శ్లాబ్-3 కింద రూ.3 నుంచి రూ.5 లక్షల వరకు, బిసి-ఎకి మూడు యూనిట్లు, బిసి-బికి ఒక యూనిట్ బిసి-డి 2 యూనిట్లు మంజూరయ్యాయని అన్నారు. ప్రతి యూనిట్‌కూ 50 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, అన్ని ధ్రువపత్రాలతో సచివాలయం, ఏదైనా ఇంటర్ నెట్ కేంద్రంలో దరఖాస్తు చేయవచ్చన్నారు. సంబంధిత ఆన్‌లైన్ కాపీని ఎంపిడిఒ కార్యాలయానికి అందజేయాలన్నారు.

24న నూతన కార్యవర్గ సమావేశం

రణస్థలం: రణస్థలం, లావేరు మండలాల ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సమావేశం ఈ నెల 24న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రణస్థలం మండలంలోని కంబాలపేట సమీపంలో ఉన్న బీరు ఫ్యాక్టరీ ప్రక్కన లే అవుట్స్‌లో నిర్వహించనున్నట్లు సంఘ ప్రతినిధి నీలకంఠం ఒక ప్రకనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు ఆంధ్రప్రదేశ్ ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు మెట్టా నాగరాజు, శ్రీకాకుళం జిల్లా ఫోటోగ్రాఫర్స్ యూనియన్ కోశాధికారి సింధు శ్రీను, పొందూరు ఫొటోగ్రాఫర్స్ యూనియన్ ప్రెసిడెంట్ జరజాపు వాసు, శ్రీకాకుళం పట్టణ ఫొటో గ్రాఫర్స్ యూనియన్ ప్రెసిడెంట్ పక్కి వేణు గోపాలరావు, వెంకట రమణ, శ్రీకాకుళం ఫొటోగ్రాఫర్స్ యూనియన్ మాజీ ప్రెసిడెంట్ జూమ్ శంకర్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి రణస్థలం, లావేరు మండలాల ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం ప్రతినిధులు, సభ్యులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

సిఎస్ఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం అర్బన్: క్రైస్తవ సమాజానికి సురక్షిత సేవలు అందించడానికి క్రిష్టియన్ సెక్యూర్ సర్వీసెస్ (సిఎస్ఎస్) ఏర్పాటైంది. గురువారం నగరంలోని ప్రైవేటు హాల్‌లో జిల్లా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా బర్న బాస్ బింకం, ప్రధాన కార్యదర్శి ఒంపూరు రమేష్, కోశాధికారి ఎం. షడ్రక్ బాబు, ఉపాధ్యక్షులు జి.సామ్యూల్ అరుణ్ కుమార్, టి.పేతురు, సహాయ కార్యదర్శి ఆర్.శామ్యూల్, టి.సూరిబాబు తదితరులు ఎన్నికయ్యారు.



మాట్లాడుతున్న సిడిపిఒ అనూరాధ

చిన్నారుల అభివృద్ధికి తోడ్పడాలి

ప్రజాశక్తి- పొందూరు

అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సిడిపిఒ ఎస్.అనూరాధ అన్నారు. మండలంలోని లోలుగు ఉపహార్ కేంద్రంలో గురువారం పోషణ భీ పడాయి భీ కార్యక్రమంపై అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లో అమలు చేస్తున్న న్యూట్రిషన్స్, ఆదర్శిలా, నవచేతన వంటి పలు విధానాలపై శిక్షణను అందించారు. మూడురోజుల పాటు ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.వి.రత్నం తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ప్రారంభం

ప్రజాశక్తి-రాజాం

జిల్లాలోని అపరాల రైతులకు అన్ని విధాల అండగా ఉంటామని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నడిపేనా వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం బొబ్బిలి సహకార సంఘంలోను, రాజాం నియోజకవర్గంలోని సంతకవిటి గ్రామంలో పెసలు మినుములు కొనుగోలు కేంద్రాల ను ఆయన ప్రారంభించారు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పంటను తీసుకుంటామని చెప్పారు. ఇ-క్రాప్‌లో నమోదైన వారు ముందుగానే రైతు సేవా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ మేనేజర్ వెంకటేశ్వరరావు

మొబైల్ బుక్ కీపింగ్‌లో నమోదు చేయాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

గ్రామ సంఘ పొదుపులు, బ్యాంకు పొదుపులు, పొదుపుల నుంచి అంతర్గత అప్పులు, బ్యాంకు రుణాలు, స్త్రీ నిధి అప్పులు, ఉన్నతి అప్పులు, సంఘం వాడిన అన్ని రకాల అప్పులను, వసూలు చేయబడిన అప్పులు, తిరిగి చెల్లింపులను మొబైల్ బుక్ కీపింగ్‌లో నమోదు చేయాలని ఎపిఎం జి.నారాయణరావు అన్నారు. గురువారం పట్టణంలోని మండల మహిళా సమైక్య కార్యాలయంలో మహిళా పరస్పర సహాయ సహకార గ్రామ సంఘం అసిస్టెంట్లకు, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లకు లోకోస్ యాప్‌లో స్వయం సహాయక సంఘాల ఆర్థిక లావాదేవీలను మొబైల్ బుక్ కీపింగ్ ద్వారా నిర్వహించుట, నమోదు చేయు విధానం, సంఘ సమావేశాలు నిర్వహించే విధానంపై రెండు రోజులు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏప్రిల్ నెల నుంచి లోకోస్ యాప్‌లో సంఘం జరిపే ఆర్థిక లావాదేవీలను ప్రతినెల నమోదు చేయాలని, డేటాను అప్‌లోడ్ చేయడంలో సాంకేతిక పొరపాట్లు చేయకుండా సంఘ ఆర్థిక లావాదేవీలను నమోదు చేయు విధానంపై అవగాహన కల్పించారు. సంఘ సభ్యులను సమావేశపరిచి, ప్రతినెల పారదర్శకంగా సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలని తెలిపారు. పొదుపులు, తీసుకున్న అప్పులు, తిరిగి చెల్లింపులు, సభ్యులకు కల్పించిన జీవనోపాధులపై స్వయం సహాయక సంఘాలకు గ్రేడింగ్ ఉంటుందని సంఘస్థాయి, గ్రామ సంఘస్థాయి సమావేశాలు విధిగా నిర్ణయించిన తేదీల్లో జరగాలని తెలిపారు. సిసిలు, మండల సమాఖ్య సిబ్బంది సంఘ సమావేశాలకు విధిగా హాజరు కావాలని, సంఘసభ్యుల ఆదాయాలు పెంపొందించే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షులు టి. ధనలక్ష్మి, కోశాధికారి సూర్యకుమారి, కార్యదర్శి బి.రోజా, ఏరియా కో-ఆర్డినేటర్ పి.రవికుమార్, సిసిలు, అకౌంటెంట్, కంప్యూటర్ ఆపరేటర్, విఒఎలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎం నారాయణరావు

'మిషన్ వాత్సల్య'ను ప్రచారం చేయాలి

పలాస : ప్రభుత్వం అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య కార్యక్రమాన్ని ప్రజల్లోకి విరివిగా తీసుకెళ్లాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు పేర్కొన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపాలిటీలోని సచివాలయంలోని ఉమెన్ ప్రొటెక్షన్ కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలకార్మికుల వ్యవస్థ నిర్మూలన, బాల్యవివాహాలు అరికట్టడం, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టడానికి తల్లిదండ్రులను చైతన్యవంతం చేయాలన్నారు.



మాట్లాడుతున్న గోవిందరావు

పిచ్చుకలను కాపాడుకోవాలి

ప్రజాశక్తి- లావేరు

ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా బుడుమూరు ఉన్నత పాఠశాలలో బుధవారం నేషనల్ గ్రీన్‌కోర్ జిల్లా కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు అధిక సంఖ్యలో ఉండే పిచ్చుకలు నేడు కనుమరుగవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విస్తరిస్తున్న పట్టణ సంస్కృతి, అడవులు, పంట చేలు తగ్గడం, పెరుగుతున్న సాంకేతిక కాలుష్యం, సెల్ టవర్ల వలన కలిగే రేడియేషన్ దీనికి కారణమని తెలిపారు. పంటలకు నష్టాన్ని కలిగించే క్రిమి కీటకాలను ఆహారంగా తీసుకొని, రైతు మిత్రులుగా సహాయపడతాయని పేర్కొన్నారు. అటువంటి పిచ్చుకలను కాపాడుకోవాలని, రానున్న వేసవి కాలంలో మట్టిపాత్రల్లో నీటిని పక్షులకు అందుబాటులో ఉంచాలని కోరారు. పాఠశాల హెచ్‌ఎం ఉరిటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పక్షులు జీవ వైవిధ్యాన్ని కాపాడతాయని చెప్పారు. వాటిని సంరక్షించుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు పడాల తమ్మినాయుడు, కూన చిన పెంటయ్య, కరవంజి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న యాత్రికులు

బొంతుపేటలో అన్నదానం

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని బెజ్జిపురం పంచాయతీ బొంతుపేటలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ రహదారికి అనుకుని ఉన్న శిర్డీసాయి మందిరం ఆరవ వార్షికోత్సవం సందర్భంగా ధర్మకర్తలు వాళ్లే గోవిందనాయుడు, జగదీష్ ఆధ్వర్యంలో వివిధ పూజా కార్యక్రమలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బొంతుపేట, బెజ్జిపురం, బోరపేట, సిగురుకొత్తపల్లి, తాళ్లవలస, గురుగుబిల్లి, సుభద్రాపురం, లావేరు, బుడుమూరు, రావివలస, గుమ్మడాం, రణస్థలం, జెఆర్‌పురం తదితర గ్రామాలకు చెందిన యాత్రికులు పాల్గొన్నారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఇఆర్ కుమారుడు తేజబాబు, లావేరు టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న ఎంపిపి దాసు

ఎంపిపి పరామర్శ

సోంపేట : మండలంలోని కొర్లాం పంచాయతీకి చెందిన గుడియా కృష్ణారావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు గురువారం మృతుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా కృష్ణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో శిలాగాణ భాస్కరరావు, మాజీ సర్పంచ్ పట్టాభి రామారావు, కోటిని శ్రీను, బంగారు పాపారావు, బాలరాజు, చంటి, ప్రభు సాహు పాల్గొన్నారు.

బకాయిల చెల్లింపుపై స్పష్టత ఇవ్వాలి



మాట్లాడుతున్న రమణమూర్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికలు ముందు ఉద్యోగులకు ప్రయోజనాలు సకాలంలో నెరవేరుస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సమస్యలపై పట్టనట్టు ప్రభుత్వం వ్యవహరించడం సరికాదని, బకాయిల చెల్లింపులపై స్పష్టత ఇవ్వాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్‌వి రమణమూర్తి డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని క్రాంతిభవన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరేళ్లకాలంలో బకాయిపడ్డ సుమారు రూ.32 వేల కోట్లు విడుదల చేసి ఉపాధ్యాయ, ఉద్యోగులను ఆదుకోవాలన్నారు. నిర్దిష్టమైన కాలంలో చెల్లించేందుకు ప్రభుత్వం ప్రకటన చేయాలన్నారు. అలాగే ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఐదు డిఎలు బకాయిపడ్డ ప్రభుత్వం ఇంతవరకు ఒక్కటి కూడా విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. గత ప్రభుత్వం బాటలోనే కూటమి ప్రభుత్వం వెళ్తోందన్న భావన ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో వ్యక్తమవుతుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ మాట్లాడుతూ 11వ వేతన సవరణ గడువు ముగిసి 21 నెలలు గడుస్తున్నా 12వ వేతన సవరణ కమిషన్ చైర్మన్ నియామకం జరగలేదని, ఇంతవరకు ఐఆర్‌ను కూడా ప్రకటించకుండా సహనాన్ని పరీక్షించడం సరికాదన్నారు. పెండింగ్ డిఎలు, ఎపిజిఎల్ఐ, పిఎఫ్ రుణాలు, రిటైర్మెంట్ చెల్లింపులపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చింతల రామారావు, కె.శ్రీనివాసరావు, ఎం.మురళి, జి.శ్రీను, సిహెచ్ జగన్, డివిఎన్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్వయంశక్తి సంఘాలతో ఆర్థికాభివృద్ధి

ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- మందస

పంచ సూత్రాలు పాటిస్తూ... తీసుకున్న రుణాలతో ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి తమ కుటుంబాన్ని, పిల్లలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న స్వయం శక్తి మహిళ మహారాణులని ఐటిడిఎ వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు కొనియాడారు. మండలంలోని కొత్తపల్లి పంచాయతీ గ్రామ సంఘ సమావేశం గురువారం నిర్వహించారు. గ్రామంలోని 28 స్వయంశక్తి సంఘాల పొదుపులు, అప్పులు, ఇంటర్నల్ లెండింగ్, పుస్తక నిర్వహణను పరిశీలించారు. పుస్తక నిర్వహణ ప్రాధాన్యతను వివరిస్తూ, ప్రభుత్వం అర్హులైన సంఘ సభ్యులకు అందిస్తున్న పిఎంఇజిపి, పిఎంఎఫ్ఎంఇ ఉమెన్ లెడ్ ఎంటర్‌ప్రయిజెస్ లోన్స్ గురించి అవగాహన కల్పించారు. ప్రభుత్వం మంచి స్వయంశక్తి సంఘాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని, అందరూ అర్థం చేసుకొని పద్ధతి ప్రకారం కట్టుబాట్లు పాటిస్తూ, సంఘాలను నడిపించుకోవాల్సిన అవసరం మహిళలకు అన్నారు. కార్యక్రమంలో గ్రామ సంఘాల ప్రతినిధులు, విఒఎ బాడ చంద్రకళ, క్లస్టర్ కో-ఆర్డినేటర్ బాలకృష్ణ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎపిఎం కూర్మారావు

గ్రామాల్లో జనసేన జెండాల ఆవిష్కరణ



మాట్లాడుతున్న చంద్రమోహన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జనసేన ఆవిర్భావాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామగ్రామాన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి పిసిని చంద్రమోహన్ పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని బలగ సమీపాన గల జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజల ఆలోచనలకు తగ్గట్టు పని చేస్తున్నారని, గ్రామాల్లో ఈ అంశాన్ని విస్తృతంగా ప్రజలకు చెప్పాలన్నారు. ఆయన అడుగు జాడల్లో ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు.

సమావేశంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షులు పాత్రుని పాపారావు, గర్బాన సత్తి బాబు, భూపతి అర్జున్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శులు కూరాకుల యాదవ్, సంతోష్ పండా, రాజు, జిల్లా కార్యదర్శులు కోరుకొండ మల్లేశ్వరరావు, అంపోలు హరీష్‌కుమార్, శ్రీకాంత్, మజ్జి భాస్కర్, తాలాబత్తుల పైడిరాజు, కొంచాడ చిన్నంనాయుడు, వడ్డాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాల్టీ అభివృద్ధి ధ్యేయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని మాజీ పురపాలక సంఘం చైర్మన్ తమ్మినేని గీత అన్నారు. గురువారం పురపాలక సంఘంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో 9వ వార్డు పరిధిలోని అమ్మానగర్‌లోని సిసి రహదారికి రూ.6.02 లక్షలు, 10వ వార్డులోని వాంబే కాలనీలో శ్మశాన వాటిక రహదారికి రూ.7 లక్షలతో నిర్మించనున్న సిసి రహదారులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడచిన వైసిపి పాలనలో పురపాలక సంఘ అభివృద్ధికి ఎటువంటి నిధులు మంజూరు చేయకుండా అభివృద్ధిని అడ్డుకున్నారన్నారు. ఎమ్మెల్యే రవికుమార్ కృషితో ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు సంపదరావు మురళీ, టిడిపి నాయకులు నాగళ్ల మురళీధర్, తంగి గురయ్య, వి.వి. కొండబాబు, అన్నెపు కృష్ణకాంత్, రీసు చిరంజీవి, ఇన్‌ఛార్జి కమిషనరు ఎ.పి.ఎస్.జాన్సన్, పి.వి.వి.కె.రాజు తదితరులు పాల్గొన్నారు.



సిసి రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న గీత



భోజనం చేస్తున్న ఎంపిడిఒ వసంతకుమార్

గిరిజన ఆశ్రమ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి- పలాస

మండలంలోని లొత్తూరు గిరిజన ఆశ్రమ పాఠశాలను ఎంపిడిఒ వసంత కుమార్, మండల పంచాయతీ విస్తీర్ణాధికారి మెట్ట వైకుంఠరావు గురువారం సందర్శించారు. విద్యార్థులు పెట్టే మధ్యాహ్న భోజనాన్ని, పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం భోజనం ఎలా ఉంది? వసతిగృహంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా? మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయి అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే... ఐటిడిఎ పిఒతో మాట్లాడి పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం లొత్తూరు సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. సచివాలయం అధికారులతో మాట్లాడి ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

ఉగాది పురస్కార విజేతలు వీరే

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కవులను ప్రోత్సహించాలన్న సంకల్పంతో వేమన కవితామయం, తపస్వీ మనోహర సంస్థలు సంయుక్తంగా ఉగాది పురస్కారాలను అందజేయనున్నారు. అందులో భాగంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కవుల నుంచి కవితా సంపుటలను ఆహ్వానించారు. ఈనెల 23న శ్రీకాకుళం నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఈ పురస్కారాలను అందజేయనున్నట్టు నిర్వాహకులు నమ్మిగడ్డ కార్తీక్, మహ్మద్ రఫీ తెలిపారు. ఉగాది (2025) పురస్కార కవితా సంపుటాల విజేతల పేర్లను గురువారం వీరు ప్రకటించారు. ఉత్తమ కవితా సంపుటలుగా పద్మావతి రాంభక్త (మెతుకు వెలుగులు), యాములపల్లి నరసిరెడ్డి (శిలావృక్షం), వైరాగ్యం ప్రభాకర్ (ఆకాశమంత), బగాది వెంకటరావు (బగాది బాసలు), వైతాళీయ కుచేలోపాఖ్యానం (మంత్రవాది వీర వెంకట సత్యనారాయణ, కడలి కవితా ప్రసూనాలు (కడలి ప్రకాశరావు). ఎంపికయ్యారు. వీరికి ఈనెల 23న పుస్కారాలను కేంద్ర సాహిత్య అకాడమీ బాలల పురస్కార విజేత నారంశెట్టి ఉమామహేశ్వరరావు చేతులమీదుగా అందజేయనున్నట్టు తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా సాహితీవేత్త, సీనియర్ జర్నలిస్టు జంధ్యాల శరత్‌బాబు, వేమన కవితామయం గౌరవ అధ్యక్షులు సురంగి మోహనరావు, కార్యదర్శి బుర్రి కుమార్ రాజు, తపస్వి మనోహరం తరుపున బి.తేజస్వి వ్యవహరించారు.



మాట్లాడుతున్న ప్రకాష్

ప్రకృతి వ్యవసాయంపై ప్రణాళిక

కోటబొమ్మాళి: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధ్యమని ప్రకృతి వ్యవసాయ ఆర్ఎల్‌డి ప్రకాష్ అన్నారు. స్థానిక మండల మహిళా సమఖ్య భవనంలో గురువారం ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి విపత్తులను నివారించేందుకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలన్నారు. రుతుపవనాలు రాక ముందే పొలాల్లో నవధాన్యాలు ఎకరానికి పన్నెండు కేజీలు వేసుకోవాలనారు. ముప్పై నుంచి నలభై రోజుల తరువాత రోటవీటర్‌తో దుక్కి దున్నుకోవాలన్నారు. దీనిద్వారా నేలలో స్థులసూక్ష్మ పోషకాలు వృద్ధి చెందుతాయన్నారు. దీంతో ప్రధాన పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారులు హేమసుందర్, జిల్లా డిపిఎం రేవతి, రంగారావు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఆర్‌టిసి కార్మికులు

ఆర్‌టిసి కార్మికుల ధర్నా

పలాస : ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిపో గేటు వద్ద గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1/19 సర్క్యులర్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పనిష్మెంట్ ఏకపక్షంగా తీసుకోవద్దన్నారు. ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. ఉద్యోత విరమణ పొందినఉద్యోగస్తుల స్థానాలను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి ఎ.వి.రావు, పున్నయ్య, ఎల్.నారాయణ, వాలి పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న ఎంపిపి దాసు

బిల్లుల చెల్లింపు వేగవంతం

సోంపేట : మండలంలో పూర్తయిన పనులకు సంబంధించి బిల్లులు వెంటనే చెల్లించాలని ఎంపిపి ఎన్.దాసు అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు పూర్తయిన వెంటనే బిల్లులు చెల్లించేలా చూడాలన్నారు. తాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఈశ్వరమ్మ, సీనియర్ అసిస్టెంట్ తిరుపతిరెడ్డి, సభ్యులు పొడవు కామేషు, బొమ్మిడి ధర్మారావు, సూరడ పాపారావు, ఉమాశంకర్ పాల్గొన్నారు.

పక్కాగా సర్వే

బూర్జ: ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న వివిధ సర్వేలు పక్కాగా నిర్వహించాలని ఎంపిడిఒ తిరుపతిరావు ఆదేశించారు. గురువారం మండలంలోని డొంకలపర్త గ్రామ సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సర్వేల నిర్వహణలో సిబ్బంది సమన్వాయం పాటించాలన్నారు. గ్రామాల్లో సర్వే నిర్వహించే సమయంలో ఎటువంటి ఆరోపణలకు చోటు లేకుండా చూడాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేలను క్లస్టర్ వారిగా సిబ్బందితో రివ్యూ చేశారు. సర్వేలు కచ్చితంగా చేయాలని సూచించారు. అనంతరం సచివాలయంలో రికార్డులను తనిఖీ చేసి అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు విజయలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ తిరుపతిరావు